సమస్యలుంటే సాక్షికి చెప్పండి

మీ సమస్యలు, ప్రజోపయోగ సూచనలు, ఇతర అంశాలను కింద ఫోన్ నంబర్‌కు వాట్సాప్ చేయండి

90324 97123

నంబర్‌ను సంప్రదించండి

క్లుప్తంగా

కేరళ బాధితుల సహాయార్థం విరాళాల సేకరణ



విరాళాలు సేకరిస్తున్న నాయకులు

సీతమ్మధార : కేరళలోని వాయనాడ్ వరద బీభత్సంలో సర్వం కోల్పోయిన బాధితుల సహాయార్థం జగదాంబ జోన్ సీపీఎం పార్టీ ఎం.సుబ్బారావు ఆధ్వర్యంలో విరాళాల సేకరణ కార్యక్రమం నిర్వహించగా రూ. 15,162 వసూలైంది. ఈ సందర్భంగా సీనియర్ నాయకుడు వై.రాజు మాట్లాడుతూ పర్యావరణ సమతౌల్యం దెబ్బ తిన్న కారణంగా ఇటువంటి విపత్తులు సంభవిస్తాయని, కార్పొరేట్ సంస్థల అనాలోచిత చర్యలే దీనికి కారణమన్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జగదాంబ జోన్ నాయకులు చంద్రమౌళి, డీవైఎఫ్ఐ నాయకుడు గణేష్, భవన నిర్మాణ కార్మిక నాయకులు కె.నర్సింగరావు, శ్రీనివాస్, నారాయణ, వాసుపల్లి చంద్రమౌళి, సత్యనారాయణ పాల్గొన్నారు.

కుటుంబ సభ్యుల చెంతకు తప్పిపోయిన వృద్ధురాలు



గౌరినాయుడుకు పైడమ్మను అప్పగిస్తున్న షెల్టర్ మేనేజర్ జ్యోతిర్మయి

అల్లిపురం : కుమార్తెతో కలిసి విజయనగరం వెళ్లేందుకు ఆర్టీసీ కాంప్లెక్స్‌కు వచ్చిన వృద్ధురాలు తప్పిపోయింది. శనివారం రాత్రి ఆమెను గుర్తించిన టూటౌన్ పోలీసులు ఏయూటీడీ సిబ్బందికి ఆమెను అప్పగించారు. ఆమె మూగ, చెముడు కావటంతో ఏయూటీడీ సిబ్బంది ఆమె వద్ద గల పెన్షన్ స్లిప్ ఆధారంగా మద్దిలపాలెం పరిసర ప్రాంతాల్లో గల సచివాలయాలకు ఆమె వివరాలను పంపించి చిరునామా తెలుసుకున్నారు. ఆమె పేరు పైడమ్మగా గుర్తించి ఆమె కుమార్తె ఫోన్ నంబర్‌ను కనుక్కున్నారు. దీంతో మద్దిలపాలెంలో ఉంటున్న ఆమె మనవడు గౌరినాయుడుని పిలిపించి అప్పగించారు. పైడమ్మ మనవడు తమ అమ్మమ్మను రక్షించి, ఆశ్రయం కల్పించిన ఏయూటీడీ మహిళా షెల్టర్ నిర్వాహకురాలు జ్యోతిర్మయికి, సిబ్బందికి, పోలీసులకు కృతజ్ఞతలు తెలిపారు.

'యావరేజ్ స్టూడెంట్ నాని' చిత్ర యూనిట్ సందడి



మాట్లాడుతున్న చిత్ర కథానాయిక స్నేహ మాల్వియా

దాబాగార్డెన్స్ : 'యావరేజ్ స్టూడెంట్ నాని' చిత్ర యూనిట్ ఆదివారం సందడి చేసింది. చిత్రాలయ ఐనాక్స్ థియేటర్‌లో నిర్వహించిన కార్యక్రమంలో హీరో పవన్‌కుమార్ కొత్తూరి మాట్లాడుతూ తాను విశాఖ వాసినని, సినిమా పరిశ్రమ అంటే తనకు చాలా మక్కువ అని చెప్పారు. అందుకే ఈ చిత్రంలో తాను హీరోగా నటిస్తూ కథ, దర్శకత్వం, నిర్మాతగా వ్యవహరించానని తెలిపారు. ఈ చిత్రాన్ని ఆశించిన దానికన్నా ప్రేక్షకులు ఆదరించారని హర్షం వ్యక్తం చేశారు. హీరోయిన్ స్నేహ మాల్వియా మాట్లాడుతూ తాను హైదరాబాద్‌లో జాబ్ చేస్తున్నానని, ఈ చిత్రంలో అవకాశం రావడం చాలా ఆనందంగా ఉందన్నారు. హీరోయిన్‌గా సారా అనే క్యారెక్టర్ చేశానని, తనకు మంచి పేరు వచ్చిందన్నారు. చిత్రాన్ని ఆదరిస్తున్న ప్రేక్షకులకు కృతజ్ఞతలు తెలిపారు.

సాక్షి
మీరు సాక్షి చందాదారులుగా చేరదలుచుకున్నారా!
లేదా మీకు పేపరు అందటంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయా!
సంప్రదించవలసిన నెంబరు
వైజాగ్ సౌత్
7997958342, 9912440606



జీవీఎంసీ-ప్రకాశరావుపేట పాఠశాల



జీవీఎంసీ ఎంవీడీ దండుబజార్ పాఠశాల

సమస్యలతో తడబడి

జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ హయాంలో సరస్వతీ సౌరభాలు వెదజల్లిన విద్యా వ్యవస్థ నేడు నిర్లక్ష్యానికి గురవుతోంది. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి దాదాపు రెండు మాసాలవుతున్నా విద్యా వ్యవస్థపై దృష్టి సారించలేదు. దీనివల్ల వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో ఒక వెలుగు వెలిగిన విద్యా వ్యవస్థ ఎటువంటి అభివృద్ధి లేక నిస్తేజంగా మారింది. అరకొరగా మధ్యాహ్న భోజనం పథకం అమలవుతోంది. విద్యాకానుక కిట్ల పంపిణీ సవ్యంగా జరగలేదు. ఇంగ్లీష్ మీడియం ఊసు లేనే లేదు. ఎన్నికలకు ముందు ఎంత మంది పిల్లలుంటే అందరికీ రూ. 15 వేలు చొప్పున ఇస్తామన్న కూటమి హామీ నేడు నెరవేరే పరిస్థితి లేక పోవడంతో తల్లిదండ్రులు తమ పిల్లల్ని ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించేందుకు పెద్దగా ఆసక్తి చూపడంలేదు.

- నిర్లక్ష్యానికి గురవుతున్న ప్రభుత్వ పాఠశాలలు
- పూర్తి స్థాయిలో అందని విద్యా కానుక
- నియోజకవర్గంలోని కొన్ని పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత



క్వీన్‌మేరీ పాఠశాల

దాబాగార్డెన్స్ : దక్షిణ నియోజకవర్గం పరిధి 29వ వార్డులోని కన్నయ్యపేటలో ప్రకాశరావుపేట-జీవీఎంసీ ఉన్నత పాఠశాల, వార్డు పరిధి దండుబజార్ వద్ద ఎంవీడీ హైస్కూల్ ఉన్నాయి. ప్రకాశరావుపేట-జీవీఎంసీ పాఠశాలలో జగనన్న గోరుముద్ద పథకంలో భాగంగా గత ప్రభుత్వం అమలు చేసిన మెనూనే డొక్కా సీతమ్మ మధ్యాహ్న బడి భోజనం పేరిట అమలు చేస్తున్నారు. అయితే నాణ్యతపై విద్యార్థుల్లో అసంతృప్తి ఉంది. జగనన్న విద్యా కానుకను సర్వేపల్లి రాధాకృష్ణన్ మిత్ర పేరుతో అందజేశారు. ఉపాధ్యాయుల విషయానికొస్తే ఎటువంటి మార్పులు, చేర్పులు లేవు. అయితే 6వ తరగతి నుంచి 10వ తరగతి వరకు ముగ్గురు ఇంగ్లీషు బోధించే ఉపాధ్యాయుల్లో ఇటీవల ఒక ఉపాధ్యాయురాలు మృతి చెందారు. ఆ పోస్టు భర్తీ చేయాల్సి ఉంది. అలాగే గత పదేళ్లుగా 6 నుంచి 10వ తరగతి వరకు ఒకే తెలుగు ఉపాధ్యాయురాలు ఉన్నారు. హిందీకి కూడా ఒక ఉపాధ్యాయుడు మాత్రమే ఉన్నారు. ఈ విషయంలో ప్రభుత్వం చర్యలు తీసుకుని తగిన సంఖ్యలో ఉపాధ్యాయులను ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉంది.

జీవీఎంసీ ఎంవీడీ పాఠశాలలో ఉపాధ్యాయుల కొరత..

జీవీఎంసీ ఎంవీడీ పాఠశాలలో జగనన్న గోరుముద్ద పథకంలో భాగంగా గత ప్రభుత్వం అమలు చేసిన మెనూనే డొక్కా సీతమ్మ మధ్యాహ్న బడి భోజనం పేరిట అమలు చేస్తున్నారు. జగనన్న విద్యా కానుకను సర్వేపల్లి రాధాకృష్ణన్ మిత్ర పేరిట అందజేశారు. ఉపాధ్యాయుల విషయానికొస్తే ముగ్గురు ఉపాధ్యాయుల కొరత ఉంది. పాఠశాల సంఖ్యను బట్టి తెలుగు, సోషల్, ఇంగ్లీషు ఉపాధ్యాయులు కావల్సి ఉంది. అలాగే ఈ పాఠశాలలో వచ్చే నెల చివరిలో ఓ ఉపాధ్యాయుడు పదవీ విరమణ చేయనున్నారు. ఆ స్థానంలో కూడా ఉపాధ్యాయుడిని భర్తీ చేయాల్సి ఉంది.

వసతుల లేమి..

జగదాంబ : జీవీఎంసీ ఎంవీడీఎం పాఠశాలలో జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ హయాంలో విద్యార్థులకు విద్యా కానుకతో పాటు పాఠశాలలో అవసరమైన తాగునీరు, మరుగుదొడ్లు, డైనింగ్ హాల్ వంటి వసతులు ఏర్పాటు చేశారు. ప్రస్తుత ప్రభుత్వంలో ఈ పాఠశాల అభివృద్ధికి అంటూ ఎటువంటి చర్యలు తీసుకోలేదు. ఇక్కడ విద్యార్థులు భోజనం చేసేందుకు సరైన వసతి లేక కింద కూర్చుని భోజనం చేయాల్సిన దుస్థితి నెలకొంది.

క్వీన్‌మేరీ ప్రభుత్వ పాఠశాలలో విద్యాకానుకపై సందిగ్ధం..

క్వీన్‌మేరీ ప్రభుత్వ పాఠశాల 3 నుంచి 10వ తరగతి వరకు నిర్వహిస్తున్నారు. ఇక్కడ 850 మంది విద్యార్థులు చదువుతున్నారు. జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ హయాంలో దుస్తులు, షూలు, సాక్స్‌లు, బ్యాగ్‌లు, పుస్తకాలు, యూనిఫాం వంటి అన్ని వస్తువులు విద్యా కానుక పేరిట పంపిణీ చేశారు. అయితే కొత్తగా ఏర్పడిన కూటమి ప్రభుత్వం ప్రస్తుత విద్యా సంవత్సరంలో విద్యాకానుక ఇస్తుందా లేదా అనేది వేచి చూడాల్సి ఉంది.

ఎంజీఎం హైస్కూల్‌లో ఉపాధ్యాయుల కొరత..

అల్లిపురం : జీవీఎంసీ 32, 33, 34 వార్డుల్లో మహాత్మాగాంధీ మున్సిపల్ హై స్కూల్, రైల్వే క్వార్టర్స్‌లో ప్రభుత్వ హై స్కూల్, అల్లిపురం మెయిన్‌రోడ్డులో జీవీఎంసీ మోడల్ స్కూల్, అచ్చియ్యమ్మపేటలో జీవీఎంసీ ప్రాథమిక పాఠశాల, బంగారుమెట్టలో జీవీఎంసీ న్యూ ప్రైమరీ స్కూళ్లు ఉన్నాయి. జగనన్న గోరుముద్ద పథకంలో భాగంగా గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అమలు చేసిన మెనూనే డొక్కా సీతమ్మ మధ్యాహ్న బడి భోజనం పేరుతో అమలు చేస్తున్నారు. విద్యా కానుక విషయానికి వస్తే ఇక్కడి కొన్ని పాఠశాలల్లో కొత్తగా చేరిన విద్యార్థులకు ఈ పథకం వర్తింపజేయలేదు. స్కూల్‌లో ఈ ఏడాది సోషల్, బయాలజీ టీచర్లు రిటైర్ అయ్యారు. వారి స్థానంలో నియామకాలు జరపకపోవటంతో ఉన్న ఉపాధ్యాయులతో నడిపిస్తున్నారు. రిటైర్డ్ బయాలజీ టీచర్‌ని రిక్వెస్ట్ చేయడంతో ఆమె వచ్చి పాఠాలు బోధిస్తున్నారు. ప్రభుత్వ రైల్వే స్కూల్, జీవీఎంసీ మోడల్ స్కూల్, అచ్చియ్యమ్మపేట స్కూల్, అల్లిపురంలోని న్యూస్కూల్‌లో గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో జరిగిన ప్రగతి తప్ప కొత్తగా ఏం జరగలేదు.



జీవీఎంసీ ఎంవీడీఎం స్కూల్లో కింద కూర్చుని భోజనం చేస్తున్న విద్యార్థులు



ఎంజీఎం హై స్కూల్‌లో విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అందజేస్తున్న ఎంఈవో, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు తదితరులు

సీపీ హార్బర్ స్టేషన్ ఆకస్మిక తనిఖీ



సిబ్బందికి సూచనలిస్తున్న సీపీ శంకబ్రత బాగ్చి

జగదాంబ : హార్బర్ పోలీసు స్టేషన్‌ను నగర పోలీస్ కమిషనర్ శంకబ్రత బాగ్చి ఆదివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ముందుగా స్టేషన్ పరిసరాలను పరిశీలించారు. ఫిర్యాదుదారులతో సిబ్బంది ప్రవర్తిస్తున్న తీరుపై ఆరా తీశారు. అనంతరం సిబ్బందికి సూచనలు చేశారు. సిబ్బంది ప్రజలతో మమేకం కావాలని తెలిపారు. స్టేషన్‌కు వచ్చిన వారిని కూర్చోబెట్టి మాట్లాడాలన్నారు. స్టేషన్‌ను ఎల్లప్పుడు పరిశుభ్రంగా ఉంచాలన్నారు. ఖాళీ స్థలాల్లో మొక్కలు నాటి ఆహ్లాదకర వాతావరణం కల్పించాలన్నారు. మరుగుదొడ్లు పరిశుభ్రంగా ఉంచాలని ఆదేశించారు. సిబ్బంది అందుబాటులో ఉండాలన్నారు. పెండింగ్ కేసులు లేకుండా పరిష్కరించాలన్నారు. రిజిస్టర్లు అప్‌డేట్‌గా ఉండాలన్నారు. సిబ్బంది సమస్యలపై ఆరా తీశారు. సిబ్బందికి కుటుంబం, ఉద్యోగపరంగా సమస్యలుంటే వెంటనే 7995095799 నంబర్‌కు ఫోన్ చేసి తెలియజేయాలన్నారు. క్రైం పోలీసు స్టేషన్ ఆవరణలో సీజ్ చేసిన వాహనాలు శిథిలం కాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. పోర్టు పరిసర ప్రాంతాల్లో ఎటువంటి దొంగతనాలు, అసాంఘిక కార్యకలాపాలు జరగకుండా పోలీసింగ్ చేయాలన్నారు. అనుమానిత ప్రాంతాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని తెలిపారు. రౌడీషీటర్లు, అనుమానితుల కదలికలు ఎప్పటికప్పుడు పరిశీలించాలన్నారు. గంజాయి రవాణాదారులను అరెస్టు చేయాలన్నారు. విధుల్లో అధికార దుర్వినియోగానికి పాల్పడితే కఠిన చర్యలు తప్పవని సీపీ హెచ్చరించారు.

శాకంబరిగా ఎర్నిమాంబ అమ్మవారు



కంచరపాలెం : జ్ఞానాపురంలోని ఎర్నిమాంబ అమ్మవారు ఆదివారం శాకంబరీదేవి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. గర్భాలయంలో అమ్మవారిని పలు రకాల కూరగాయలు, ఆకుకూరలతో అలంకరించారు. ఆలయ అర్చకులు శ్రీకాంత్‌శర్మ అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి భక్తులకు దర్శనాలు కల్పించారు. భక్తులు సంపూర్ణ ఆరోగ్యంతో ఉండాలని అమ్మవారిని శాకంబరీదేవిగా అలంకరించినట్లు ఈవో సురేష్‌బాబా తెలిపారు. ఆలయ పూజారమ్మ వాసుపల్లి విజయమ్మ, సిబ్బంది ప్రసాదరావు, రామకృష్ణారావు, కమిటీ సభ్యులు పనులు పర్యవేక్షించారు.

కూటమి నేతలకు కోడ్ వర్తించదా?



ముసుగు వేసిన మహానేత రాజశేఖర్‌రెడ్డి విగ్రహం



పక్కనే ఎలాంటి ముసుగు వేయని ఎమ్మెల్యే వంశీ కటౌట్

జగదాంబ : కూటమి ప్రభుత్వానికి ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ వర్తించదా అని పలువురు ప్రశ్నిస్తున్నారు. ప్రస్తుతం ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల కమిషన్ కోడ్ జారీ చేసింది. గత నెల 30 నుంచి వచ్చే నెల 6వ తేదీ వరకు ఇది అమల్లో ఉంటుంది. కానీ అధికార యంత్రాంగం చూసీచూడనట్లు వ్యవహరిస్తుందని పలువురు ఆరోపిస్తున్నారు. కోడ్ నేపథ్యంలో రాజకీయ నాయకుల బ్యానర్లు, విగ్రహాలు, కటౌట్లు కనిపించకుండా చర్యలు తీసుకోవాలి. కానీ జీవీఎంసీ అధికారులు కూటమి నేతల కొమ్ము కాస్తున్నారు. జగదాంబ జంక్షన్‌లో మహానేత డాక్టర్ వై.ఎస్. రాజశేఖర్‌రెడ్డి విగ్రహానికి ముసుగు వేశారు కానీ పక్కనే కూటమి నేతలతో కలిసి ఉన్న నియోజకవర్గ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ కటౌట్‌ను వదిలేయటం విడ్డూరంగా ఉందని పలువురు గుసగుసలాడుకుంటున్నారు.

మానవత్వం చాటుకున్న సీపీ



యాచకుడిని కేజీహెచ్‌కు తరలించిన సీపీ శంఖబ్రత బాగ్చి

అల్లిపురం: డివైడర్‌పై ప్రమాదకర స్థితిలో పడి ఉన యాచకుడి పట్ల నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి మానవత్వం చాటుకున్నారు. ఆదివారం రైల్వేస్టేషన్ సమీపంలో సాధారణ తనిఖీలు నిర్వహిస్తుండగా ఒక యాచకుడు ప్రమాదకర పరిస్థితిలో డివైడర్‌పై పడి ఉండటాన్ని ఆయన గమనించారు. తక్షణమే తన వాహనం ఆపిన ఆయన యాచకుడి పరిస్థితి తెలుసుకుని తన ఎస్కార్ట్ వాహనంలోనే కేజీహెచ్‌కు తరలించారు. స్వతహాగా డాక్టర్ అయిన ఆయన కేజీహెచ్‌లో వైద్యులతో మాట్లాడి అవసరమైన చికిత్స అందించేందుకు దోహదపడ్డారు.

సందడిగా స్నేహితుల దినోత్సవం..

- ఫ్రెండ్‌షిప్ బాండ్లు కట్టుకున్న చిన్నాపెద్దా
- స్వీట్స్ తినిపించుకుని శుభాకాంక్షలు తెలుపుకున్న ఫ్రెండ్స్



ఆనందడోలికల్లో రైల్వే హైస్కూల్ 1987-88 టెన్త్ విద్యార్థులు

దాబాగార్డెన్స్ : ఊపిరి నిలిచే వరకు, కాలం నడిచే వరకు, పయనం సాగే వరకు, నయనం చూసే వరకు స్నేహం కొనసాగాలని ఆరాట పడుతుంది. అంత గొప్ప స్నేహానికి పట్టం కట్టే ఫ్రెండ్‌షిప్ డే కోసం ఊరంతా ఆదివారం సందడి చేసింది. నగరంలోని బీచ్‌రోడ్డుతో పాటు పార్కులు, చదువుకున్న పాఠశాలలు, కళాశాలల్లో స్నేహితుల దినోత్సవం సందడి కనిపించింది. చిన్నారుల సందడైతే అంతా ఇంతా కాదు. ఎక్కడికక్కడ ఏర్పాటైన దుకాణాల వద్ద ఫ్రెండ్‌షిప్ బాండ్‌లు కొనుగోలు చేసుకుని అక్కడికక్కడే కట్టి స్నేహితుల దినోత్సవ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. వయస్సుతో నిమిత్తం లేకుండా బాండ్‌ల కొనుగోలు హోరెత్తింది. అభిరుచి, వయస్సును బట్టి ఐదు రూపాయల నుంచి రూ.100 వరకు ఫ్రెండ్‌షిప్ బాండ్‌లు రకరకాల రీతుల్లో విక్రయించారు.

చిన్నారుల సందడి..

స్వామి వివేకానంద స్వచ్ఛంద సేవా సంస్థలో ట్యూషన్ విద్యార్థులు ఆదివారం స్నేహితుల దినోత్సవాన్ని వేడుకగా జరుపుకున్నారు. ఒకరికొకరు ఫ్రెండ్‌షిప్ బాండ్‌లు కట్టుకుని శుభాకాంక్షలు తెలుపుకున్నారు. స్వీట్స్ తినిపించుకున్నారు. ఆటలు, పాటలతో ఎంజాయ్ చేశారు.

రైల్వే హైస్కూల్ పూర్వ విద్యార్థుల సందడి..

అల్లిపురం : సృష్టిలో మధురమైనది స్నేహం. త్యాగానికి ప్రతిరూపం స్నేహమంటు సందడి చేశారు రైల్వే స్టేషన్ దరి ప్రభుత్వ హైస్కూల్ 1987-88 టెన్త్ విద్యార్థులు. స్నేహితుల దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం ఉదయం నగరంలోని ఒక హోటల్లో ఆట పాటలతో సందడి చేశారు. ఆప్యాయంగా పలకరించుకుని కష్ట సుఖాలు అడిగి తెలుసుకున్నారు. భవిష్యత్ ప్రణాళికలు రూపొందించుకున్నారు. స్నేహితుల దినోత్సవం సందర్భంగా మళ్లీ విద్యార్థులుగా మారిపోయారు. ఆట పాటలు, నృత్యాలతో హోరెత్తించారు. పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. ఒకరి కష్టాల్లో ఒకరు తోడుగా ఉందామని వాగ్దానాలు చేసుకున్నారు. ఆర్థికంగా వెనుకబడిన వారికి భరోసా కల్పించేలా, స్నేహానికి గల మాధుర్యాన్ని ప్రతి ఒక్కరు అనుభవించి రోజంతా గడిపి వచ్చే ఏడాది స్నేహితుల దినోత్సవం వరకు మధుర జ్ఞాపకాలను నెమరువేస్తూ వీడ్కోలు తీసుకున్నారు.

స్నేహితుల సందడి

కంచరపాలెం: అంతర్జాతీయ ఫ్రెండ్‌షిప్ డే వేడుకలను ఆదివారం స్నేహితులంతా కలిసి ఆనందగా.. సందడిగా జరుపుకున్నారు. జ్ఞానాపురం సేక్రెడ్ హార్ట్ బాలికోన్నత పాఠశాలకు చెందిన 2001 టెన్త్ బ్యాచ్ విద్యార్థినులు ప్రతి ఏటా మాదిరిగానే స్నేహితుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఆర్కే బీచ్ వద్ద నాటి స్నేహితులంతా కలిసి తమ పాత జ్ఞాపకాలను నెమరవేసుకుంటూ సంతోషంగా గడిపారు. పూర్వ విద్యార్థులు పల్లా ప్రశాంతి, ఉజ్వల, భవాని, శ్రీవాణి, లీలా, హైమా, రత్నజ్యోతి, వరలక్ష్మి, నాగలక్ష్మి, సిరి, శాంతి, పుష్ప తదితరులు పాల్గొన్నారు



ఫ్రెండ్‌షిప్ బాండ్‌లు కట్టుకుంటున్న స్వామి వివేకానంద సంస్థ ట్యూషన్ పిల్లలు



ఫ్రెండ్‌షిప్ డే వేడుకల్లో సేక్రెడ్ హార్ట్ హైస్కూల్ 2001 టెన్త్ బ్యాచ్ విద్యార్థినులు

ఘోషాస్పత్రిలో ఉచిత భోజనం పంపిణీ



పేషెంట్ సహాయకులకు ఉచిత భోజనం ప్యాకెట్లు అందజేస్తున్న వేణుగోపాల్

దాబాగార్డెన్స్ : సంఘ సేవకుడు, జనప్రియ అధినేత వేణుగోపాల్ సహాయ సహకారంతో వివేకానంద స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం ప్రభుత్వ విక్టోరియా (ఘోషా) ఆస్పత్రిలో పేషెంట్ సహాయకులకు ఉచితంగా భోజనం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వేణుగోపాల్ మాట్లాడుతూ సుదూర ప్రాంతాల నుంచి వస్తున్న పేషెంట్ల ఇబ్బందులను గుర్తించి, వారి సహాయకులకు ఏడాదిగా స్వామి వివేకానంద సంస్థ భోజనం అందజేస్తుందని, ఈ కార్యక్రమంలో తాము కూడా భాగస్వాములు కావాలన్న ఉద్దేశంతో నెలలో 7 రోజుల పాటు ప్రతి నెలా ఉచితంగా భోజనాలు పంపిణీ చేయనున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో వేణుగోపాల్ మిత్రమండలి, స్వామి వివేకానంద సంస్థ అధ్యక్షుడు సూరాడ అప్పారావు, సభ్యులు పాల్గొన్నారు.

అందుబాటులో రెడీమేడ్ వస్త్రాలు



మొదటి వార్షికోత్సవ వేడుకల్లో మహిళలు

దాబాగార్డెన్స్ : మహిళల అభిరుచికి తగ్గట్టు అధునాతన డిజైన్లతో ఫ్యాషన్ రంగంలో తనకంటూ ఓ ప్రత్యేకత చాటుకున్న డ్రాపరీస్ ఫ్యాషన్ అండ్ ఆర్ట్ స్టూడియో రెడీమేడ్ వస్త్రాలు అందుబాటులో ఉంచిందని ఎన్ఐఎఫ్‌టీ (ఢిల్లీ) మాస్టర్ అండ్ డిజైనర్ శాలిని నిరంజన్ తెలిపారు. నగరంలో గల స్టూడియో మొదటి వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని నిర్వహించిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ ప్రస్తుత ఫ్యాషన్ రంగంలో సరికొత్త డిజైన్లకు ఆకర్షితులవుతున్న మహిళల అభిరుచికి తగ్గట్టుగా ఇంటర్నేషనల్ డిజైనర్స్ వీటిని తయారు చేయడం తమ ప్రత్యేకతగా చెప్పారు.

సిటిజన్ ఫోరం నూతన కార్యవర్గం

దాబాగార్డెన్స్ : విశాఖ సిటిజన్ ఫోరం నూతన కార్యవర్గ ఎన్నిక ఆదివారం నగరంలోని రెడ్నంగార్డెన్స్‌లో గల ఓ హోటల్లో నిర్వహించారు. కార్యక్రమంలో విశాఖ పశ్చిమ ఎమ్మెల్యే పీవీజీవీ ఆర్ నాయుడు (గణబాబు) పాల్గొని నూతన కార్యవర్గంచే ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫోరం సేవలను కొనియాడారు. నాగార్జున విశ్వ విద్యాలయం మాజీ ఉపకులపతి ప్రొఫెసర్ వి. బాలమోహన్‌దాస్ ఫోరం నూతన కార్యవర్గాన్ని అభినందించారు. ఫోరం నాయకుడు, విద్యార్థి వెంకట్రావు మాట్లాడుతూ ఫోరం ప్రారంభించి 13 ఏళ్లుగా సేవలందిస్తున్నామన్నారు. అనంతరం ఫోరం గౌరవ అధ్యక్షుడిగా పి. వెంకట్రావు, అధ్యక్షుడిగా పీఎస్ తిలక్, ఉపాధ్యక్షుడిగా కె. సత్యనారాయణ, కార్యదర్శిగా పి. రామకృష్ణ, సహాయ కార్యదర్శిగా బి. సీతారామయ్య, కోశాధికారిగా పి. రాము, సహాయ కోశాధికారిగా ఎస్. సోమునాయుడుతో పాటు నలుగురు సభ్యులచే ప్రమాణ స్వీకారం చేయించారు. కార్యక్రమంలో పలువురు ఫోరం సభ్యులు పాల్గొన్నారు.

గీతం ఆస్పత్రిలో మృతుని బంధువుల ఆందోళన



ఆందోళన చేస్తున్న సురేష్ భార్య ఝాన్సీ, కుటుంబ సభ్యులు

కొమ్మాది : వైద్యుల నిర్లక్ష్యం కారణంగానే తన భర్త చనిపోయాడంటూ ఓ మహిళ గీతం ఆస్పత్రిలో ఆందోళనకు దిగింది. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం... మధురవాడ స్వతంత్రనగర్‌కు చెందిన పంతం సురేష్ (37) శనివారం ఉదయం ఊపిరితిత్తుల సమస్యతో బాధపడుతుండగా ఆయన భార్య ఝాన్సీ చికిత్స నిమిత్తం రుషికొండలో గల గీతం ఆస్పత్రిలో చేర్పించారు. ఆదివారం ఉదయం వైద్యులు రక్తం తక్కువగా ఉందని ఎక్కించాలని, పరిస్థితి విషమంగా ఉందని ఆరోగ్య శ్రీకి దరఖాస్తు చేసుకోమని సూచించినట్లు ఆమె తెలిపారు. అయితే అన్నీ అయిన తర్వాత ఆదివారం సాయంత్రం ఆరు గంటలకు సురేష్ చనిపోయినట్లు వైద్యులు తెలిపారు. ఇదిలా ఉండగా జూనియర్ వైద్యులతో వైద్యం అందించారని, కనీసం రక్తం ఎక్కించడం కూడా చేతకాని జూనియర్ వైద్యులతో చికిత్స చేయించడం వల్లే తన భర్త చనిపోయాడంటూ ఝాన్సీ ఆరోపిస్తున్నారు. ఇప్పుడు మృతదేహాన్ని ఇవ్వమంటే డబ్బులు డిమాండ్ చేస్తున్నారని ఆమె ఆరోపించారు. రెండు రోజులపాటు వైద్యం చేస్తున్నట్లు ఇక్కడి డాక్టర్లు హడావిడి చేశారని, ఉదయం నుంచి కోలుకుంటున్న వ్యక్తి సాయంత్రమయ్యేసరికి ఎలా చనిపోతాడంటూ ఆందోళన చేశారు. విషయం తెలుసుకున్న పీఎం పాలెం పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు.

ఆసియన్ బాక్సింగ్ సెలక్షన్ ట్రయల్స్‌కు దీపిక



బాక్సింగ్ కోచ్ శ్రీనివాసరావుతో క్రీడాకారిణి దీపిక

ఉక్కునగరం: ఆసియన్ బాక్సింగ్ సెలక్షన్ ట్రయల్స్‌కు స్టీల్‌ప్లాంట్ విద్యార్థిని కనక దీపిక ఎంపికయ్యారు. ఆగస్టు 27 నుంచి సెప్టెంబర్ 10 వరకు అబుదాబీలోని ఎ1 ఏఈఎన్ సిటీలో ఏఎస్‌బీసీ ఆసియన్ జూనియర్ బాలుర, బాలికల బాక్సింగ్ చాంపియన్‌షిప్-2024 పోటీలు నిర్వహించనున్నారు. ఈ పోటీల్లో అర్హత కోసం బాక్సింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (బాయ్) ఆధ్వర్యంలో ఈనెల 8 నుంచి 11 వరకు రోహతక్‌లోని సాయ్‌లో సెలక్షన్ ట్రయల్స్ నిర్వహిస్తున్నారు. జాతీయ డీఏవీ బాక్సింగ్ పోటీల్లో కాంస్య పతకం, స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా పోటీల్లో రాష్ట్రస్థాయిలో బంగారు పతకం, సీబీఎస్ఈ సౌత్ జోన్ పోటీల్లో కాంస్యపతకం సాధించిన కనక దీపికను ఆంధ్రప్రదేశ్ బాక్సింగ్ అసోసియేషన్ సెలక్షన్ ట్రయల్స్‌కు ఎంపిక చేసింది. ఈ సందర్భంగా ఆదివారం జరిగిన కార్యక్రమంలో దీపికను స్టీల్‌ప్లాంట్ బాక్సింగ్ కోచ్ కె. శ్రీనివాసరావు అభినందించారు. దీపిక తండ్రి కె. వెంకటరామారావు స్టీల్ ప్లాంట్‌లో చార్జిమెన్ కాగా తల్లి భవానీ న్యాయవాదిగా ప్రాక్టీసు చేస్తున్నారు.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
వైజాగ్ సౌత్
9010810033, 9010196663
Office mail : sakshiadvtvsp@gmail.com